కూటమిలో ధీమా!

● ఎగ్జిట్ పోల్స్ ఫలితాలతో ఫుల్ జోష్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ









తిరుపతి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎగ్జిట్ పోల్స్ ఫలితాలతో ఎన్డీఏ కూటమి పార్టీల్లో విజయం పట్ల ధీమా పెరిగింది.పేరు ప్రతిష్టలు, విశ్వసనీయత కలిగిన 24 సర్వే సంస్థలు రాష్ట్రంతో పాటు జిల్లాలో కూడా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికే మెజారిటీ స్థానాలు దక్కుతాయని ప్రకటించడంతో మూడు పార్టీల శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.పయనీర్ సంస్థ విడుదల చేసిన ఫలితాలు తిరుపతి ఎంపీతో పాటు ఐదు అసెంబ్లీ స్థానాలు కూటమి ఖాతాలో వేశాయి.కేవలం రెండు స్థానాలనే వైసీపీ ఖాతాలో వేశాయి. గూడూరు, వెంకటగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి సీట్లు కూటమికి దక్కుతాయని, సూళ్ళూరుపేట, సత్యవేడు మాత్రం వైసీపీకి దక్కుతాయని ఆ సంస్థ ఫలితాలు చెబుతున్నాయి. పల్స్ టుడే సర్వే ఫలితాలు కూటమికి 4 సీట్లు, వైసీపీకి 3 సీట్లు దక్కుతాయని వెల్లడించాయి.

గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి స్థానాలు కూటమి ఖాతాలో, సూళ్ళూరుపేట, చంద్రగిరి, సత్యవేడు స్థానాలు వైసీపీ ఖాతాలో వేశాయి. చాణక్య స్ట్రాటజీస్ సంస్థ తిరుపతి ఎంపీ సీటు వైసీపీకి దక్కుతుందని చెబుతోంది. అయితే ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమికి 3, వైసీపీకి 2 చొప్పున దక్కుతాయని, మిగిలిన రెండు స్థానాల్లో గట్టి పోటీ వుందని చెబుతోంది. స్థానాల వారీగా శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి కూటమికి దక్కుతాయని, చంద్రగిరి, సూళ్ళూరుపేట వైసీపీకి దక్కుతాయని, తిరుపతి, సత్యవేడుల్లో గట్టి పోటీ వుంటుందని వెల్లడించింది. చాణక్య ఎక్స్ అనే సంస్థ వెలువరించిన ఫలితాలు మిశ్రమంగా వున్నాయి. తిరుపతి ఎంపీ సీటు వైసీపీ వైపు మొగ్గు వుందని వెల్లడిస్తోంది. శ్రీకాళహస్తి, తిరుపతి స్థానాలు టీడీపీకి, సూళ్ళూరుపేట, సత్యవేడు స్థానాలు వైసీపీకి దక్కుతాయని చెబుతోంది. అలాగే గూడూరులో టీడీపీ వైపు మొగ్గు కనిపిస్తుండగా వెంకటగిరి, చంద్రగిరిల్లో వైసీపీ వైపు మొగ్గు కనిపిస్తోందని ఈ సంస్థ ఫలితాలు చెబుతున్నాయి. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలలో ఏడు అసెంబ్లీ స్థానాలకు గానూ కూటమి, వైసీపీ నడుమ ఒకటి రెండు స్థానాల తేడాయే కనిపిస్తున్నా రాష్ట్ర వ్యాప్తంగా కూటమికి అధికారం దక్కుతుందనే అంశం కూటమి పార్టీల శ్రేణుల్ని సంబరపరుస్తోంది.

అత్యధిక సర్వే సంస్థల మొగ్గు కూటమి వైపే!

ఇండియా టుడే, సీఎన్ఎన్ న్యూస్, ఏబీపీ న్యూస్, న్యూస్ ఎక్స్, ఇండియా టీవీ, జీ న్యూస్, బిగ్ టీవీ, పయనీర్ పోల్ స్ట్రాటజీస్ వంటి పేరున్న 24 సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ సర్వేల ఫలితాలను శనివారం రాత్రి వెల్లడించగా ఇంచుమించు వాటన్నింటి సారాంశం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం సాధిస్తుందని చెబుతోంది. ఎగ్జిట్ పోల్స్ సర్వే ఫలితాల కోసం జిల్లావ్యాప్తంగా ఇటు రాజకీయ పక్షాలు, అటు ప్రజానీకం కూడా ఉత్కంఠగా వేచి చూశాయి. మెజారిటీ సంస్థల ఫలితాలు కూటమికి అనుకూలంగా వెలువడడంతో కూటమి పార్టీల నేతల్లో సంబరం నెలకొంది. ఎక్కడ చూసినా దీనిపైనే చర్చ నడిచింది. 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపులో ఫలితాలు లాంఛనప్రాయమేనన్న ధీమా కూటమి పార్టీల శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. పెద్దగా ప్రాచుర్యం లేని కొన్ని సంస్థలు మాత్రమే వైసీపీకి అధిక స్థానాలు దక్కుతాయని ప్రకటించాయి. పేరున్న సంస్థలన్నీ వైసీపీ ఓటమిని నిర్ధారించగా ఆ పార్టీ శ్రేణులు డీలా పడిపోయాయి. నాయకులు పైకి బింకంగా కనిపిస్తున్నా అంతర్గతంగా గెలుపుపై అనుమానాలు పెరిగిపోయే పరిస్థితులను ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు సృష్టించాయి.

చిత్తూరులో నాలుగు కూటమికి.. మూడు వైసీపీకి..

చిత్తూరు జిల్లా విషయానికి వస్తే దాదాపు అన్ని సంస్థలూ ఒకే తరహా ఫలితాలను విడుదల చేశాయి. కుప్పం, పలమనేరు, నగరి, చిత్తూరు స్థానాల్లో టీడీపీ గెలుస్తుందని.. పుంగనూరు, పూతలపట్టు, జీడీనెల్లూరులో వైసీపీ విజయం సాధిస్తుందని చాణక్య స్ట్రాటజీస్, చాణక్య ఎక్స్, పల్స్ టుడే, సర్వే ఫ్యాక్టరీ సంస్థలు చెప్పాయి. పయనీర్ పోల్ స్ట్రాటజీ పూతలపట్టు కూడా టీడీపీకే అంటోంది. సర్వే ఫ్యాక్టరీ అయితే జీడీనెల్లూరు టఫ్ అంటోంది. మొత్తంగా జిల్లాలో సింహభాగం స్థానాలు కూటమి దక్కించుకుంటుందని సర్వేలు చెప్తున్నాయి. ప్రముఖ సంస్థ ఆరా సర్వే మాత్రం రాష్ట్రంలో వైసీపీ తిరిగి అధికారంలోకి రానుందని చెప్తోంది.



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, పక్కనే ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కౌంటింగుకు సర్వం సిద్ధం

● 20 నిమిషాలకో రౌండ్ ఫలితం

తిరుపతి (కలెక్టరేట్), జూన్ 1: జిల్లాలో ఓ పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ 4వ తేదీన తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతుందని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి మీడియాకు వివరాలు తెలిపారు. ఆయన మాటల్లోనే.. మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉంటుంది. అరగంట తర్వాత ఈవీఎంలోని ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. ఈవీఎంలతోపాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కూడా సమాంతరంగా జరిగేలా 16 కౌంటింగ్ హాల్స్ సిద్ధం చేశాం. చంద్రగిరి మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాలకు 14 టేబుళ్లు ఉంటాయి. పార్లమెంటుకు కూడా ఇదే తర హాలో లెక్కింపు ఉంటుంది. చంద్రగిరికి మాత్రం పోలింగ్ కేంద్రాలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా 20 టేబుళ్లను ఏర్పాటు చేశాం. తిరుపతి, సత్యవేడు, చంద్రగిరిలకు 20 రౌండ్లలో లెక్కింపు జరుగుతుంది. సూళ్లూరుపేట, వెంకటగిరికి 22 రౌండ్లు, గూడూరు, శ్రీకాళహస్తికి 21రౌండ్ల చొప్పున ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తాం. మొదటి రౌండు ఓట్ల లెక్కింపునకు అరగంట పడుతుంది. ఆ తర్వాత 20 నిమిషాలకే ఓ రౌండు పూర్తి చేస్తాం. మధ్యాహ్నాం మూడు గంటలకల్లా పూర్తిస్థాయిలో ఫలితాలు వెల్లడిస్తాం. పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సంబంధించి తిరుపతి అసెంబ్లీ పరిధిలో 4,766 ఓట్లు ఉన్నందున ప్రత్యేక గది ఏర్పాటు చేశాం. పార్లమెంటు, అసెంబ్లీకి సంబంధించి 250 టేబుళ్ల ద్వారా 164 రౌండ్లలో ఎన్నికల ఫలితాలు విడుదల చేస్తాం. తిరుపతి పార్లమెంటు పరిధిలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 19,503 ఓట్లు పోలవడంతో మూడు రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుంది. ఒక్కో టేబుల్‌కు ఏఆర్వో నేతృత్వంలో నలుగురు సిబ్బంది కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొంటారు. ఓట్ల లెక్కింపునకు రెండువేల మంది ఉద్యోగులను నియమించాం. వీరికి ఇప్పటికే రెండు దఫాలుగా శిక్షణ ఇచ్చాం. ప్రతి రౌండు ఫలితాలు మీడియాకు ఎప్పటికప్పుడు చేరవేస్తాం. ఈసీ మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ కేంద్రంలోకి మొదట గుర్తింపు పొందిన పార్టీల ఏజెంట్లకు అనుమతిస్తాం. స్థలాభావం దృష్ట్యా ఎంతమందికి అవకాశం ఉంటే అంతమందికి అనుమతి ఉంటుంది. కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు గొడవలు చేసినా.. ఆటంకం కల్గించినా కేసు పెట్టి, జైలుకు పంపుతాం' అని కలెక్టర్ స్పష్టం చేశారు.

కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ అనుమతించం: ఎస్పీ

కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ అనుమతి లేదని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పష్టం చేశారు. కౌంటింగ్ దృష్ట్యా 2,500 మంది సిబ్బందిని నియమించామని చెప్పారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ఫలితాలు ముగిశాక బాణసంచా కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిషేధించామని, అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడు కంపెనీల సాయుధ బలగాలు, అదనపు పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉందన్న విషయాన్ని అభ్యర్థులు గుర్తుంచుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఆర్వో పెంచలకిషోర్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే క్రిమినల్ కేసులు పెట్టండి

● కౌంటింగ్ ప్రక్రియ పూర్తి బాధ్యత ఆర్వోదే
● అధికారులకు కలెక్టర్ ఆదేశం

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో నిష్పక్షపాతంగా వ్యవహరించి, అల్లర్లు సృష్టించే వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. కౌంటింగ్ నేపథ్యంలో శాంతి భద్రతలపై కలెక్టరేట్‌లో శనివారం ఆర్వోలు, పోలీసు అధికారులతో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, పోలీసు అబ్జర్వర్ సరితతో కలిసి సమీక్షించారు. పోలింగ్ తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి బాధ్యత రిటర్నింగ్ అధికారి(ఆర్వో)నే వహించాల్సి ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రపరిధిలో డ్రోన్ ఫ్లయింగ్ నిషేధం అమల్లో ఉందని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, తిరుపతి మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

'పోస్టల్ బ్యాలెట్' లెక్కింపు పక్కాగా ఉండాలి: జేసీ

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పక్కాగా ఉండాలని సిబ్బందికి జాయింట్ కలెక్టర్ ధాన్యచంద్ర సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం కౌంటింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఉదయం ఎనిమిది గంటలకే లెక్కింపు ప్రారంభం అవుతుందని, 25 ఓట్లు చొప్పున కట్ట కట్టాలని, ప్రతి టేబుల్‌కు 500 ఓట్లు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుపతి కమిషనర్ అదితిసింగ్, పోస్టల్‌బ్యాలెట్ నోడల్ ఆఫీసర్ సుశీలాదేవి, ఆయా నియోజకవర్గాల ఆర్వోలు పాల్గొన్నారు.

ఎన్నికల ఏజెంట్లకు ఆల్కహాల్ టెస్ట్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 1: కౌంటింగ్ కేంద్రంలోకి ఏజెంట్లతోపాటు ఎవరైనా మద్యం తాగి వస్తే మాత్రం జైలు పాలుకాక తప్పదని ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఈ క్రమంలో ఏజెంట్లను బ్రీత్ అనలైజర్లతో తనిఖీ చేశాకే కౌంటింగ్ హాలులోకి అనుమతించనున్నారు. దీని కోసం ప్రత్యేకంగా పోలీసులను నియమించనున్నారు.

రేపు సాయంత్రం నుంచి మద్యం బంద్

సోమవారం సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రం వరకు మూడ్రోజులపాటు మద్యం షాపులు, బార్లు బంద్ కానున్నాయి. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం అన్ని మద్యం షాపులకు సీల్ వేస్తామని ఎక్సైజ్ అధికారి పేర్కొన్నారు.

ట్రయల్ రన్‌లో వెలువడ్డ విషవాయువు

● సీఎంఆర్ ఫ్యాక్టరీలో 35మంది కార్మికులకు అస్వస్థత



బాలాజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళా కార్మికులు

రేణిగుంట, జూన్ 1 : విషవాయువులు పీల్చి 35మంది కార్మికులు అస్వస్థతకు గురైన సంఘటన ఏర్పేడు మండలంలో శనివారం చోటు చేసుకుంది. కార్మికుల కథనం మేరకు... చింతలపాళెం టోల్‌ప్లాజా-రాజులపాళెం మధ్య సీఎంఆర్ ఏకో అల్యూమినియం కర్మాగారాన్ని త్వరలో ప్రారంభించేందుకు యంత్రాల పనితీరుపై వారం రోజులుగా ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నాం కర్మాగారంలో అల్యూమినియం ముక్కలను కరిగించే యంత్రంలో మంట అధికంగా మండించేందుకు ప్లాస్టిక్ ఖాళీ డబ్బాలను ఉపయోగించారు.వరిపైరుకు వాడే మోనోక్రోటోఫాస్ పురుగు మందు డబ్బా నిప్పుల్లో వేయడంతో అది పగిలి అందులో ఉన్న రసాయనాలు అక్కడ పనిచేస్తున్న కార్మికులపై పడ్డాయి. నిమిషాల వ్యవధిలో రసాయనాల వాసన చుట్టూ వ్యాపించడంతో విధుల్లో ఉన్న కార్మికుల్లో కొంతమంది అవి పీల్చి కళ్లు తిరిగి పడిపోగా మరికొంత మంది అస్వస్థతకు గురయ్యారు. వారందరినీ హుటాహుటిన కర్మాగారం బస్సులో సమీపంలోని బాలాజీ ఆస్పత్రికి తరలించారు. అస్వస్థతకు గురైన వారిలో 25మంది మహిళలుండగా పదిమంది పురుషులు ఉన్నారు.సగం మంది మధ్యాహ్నాం 2గంటలకు కోలుకోవడంతో ఇంటికి పంపారు. మరికొందరిని అబ్జర్వేషన్‌లో ఉంచి సాయంత్రం పూర్తిగా కోలుకోవడంతో ఇంటికి పంపారు.తిరుపతి ఎంపీ గురుమూర్తి చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

2,41,946 మందికి సామాజిక పింఛన్ల పంపిణీ



తిరుపతి(కలెక్టరేట్), జూన్ 1: జిల్లాలో మే నెలకు సంబంధించి సామాజిక పింఛన్లు శనివారం 2,69,684 మందికిగాను 2,41,946 మందికి పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ ప్రభావతి తెలిపారు. ఇక మంచానికే పరిమితమై బ్యాంకుల వద్దకు రాలేని వృద్ధులు, ఇతర జిల్లాలో బ్యాంకు ఖాతాలున్న వారికి 73,819మందికిగాను 59,466మందికి పంపిణీ చేశామన్నారు. 1,82,480మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు పింఛను నగదు జమైందని, 13,385మందికి జమ కావాల్సి ఉందని ఆమె పేర్కొన్నారు.

బ్యాంకుల వద్ద వృద్ధుల పడిగాపులు

శనివారం మధ్యాహ్నం పైనుంచి సాయంత్రం వరకు కూడా చాలామంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కాలేదు. మరోవైపు వృద్ధులు నగదు కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాత్రి 9.30గంటలకు 90శాతం మంది లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమైనట్లు అధికారులు తెలిపారు. రెండో రోజు ఆదివారం, బ్యాంకులకు సెలవు కావడంతో పింఛనుదారులు నగదు తీసుకునే పరిస్థితి లేదు. దీంతో ప్రభుత్వం తీరుపై పింఛనుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తల్లిని చూసేందుకు వెళుతూ తనయుడి మృతి

● బైక్ ప్రమాదంలో తండ్రికి తీవ్రగాయాలు


నాయుడుపేట టౌన్, జూన్ 1:అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లిని చూసేందుకు తండ్రిని తీసుకెళ్తున్న ఓ ఇంజనీరింగు విద్యార్థి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు.పోలీసుల కథనం మేరకు.... సూళ్లూరుపేట పట్టణం సాయినగర్‌లో నివాసం ఉంటున్న శరత్‌కుమార్ రెడ్డి భార్య పవిత్ర అనారోగ్యంతో గూడూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.శనివారం శరత్‌కుమార్‌రెడ్డి తన కుమారుడు హర్షిక్(21)తో కలిసి భార్యను చూసేందుకు బైక్‌పై గూడూరుకు బయల్దేరాడు. మార్గమధ్యంలోని పండ్లూరు సమీపంలోకి రాగానే ముందు వెళుతున్న లారీ బ్రేక్ వేయడంతో హర్షిక్ నడుపుతున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో హర్షిక్ మృతి చెందగా శరత్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శరత్‌కుమార్‌రెడ్డిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.



సంఘటనా స్థలంలో పడివున్న తండ్రీకొడుకులు - (ఇన్‌సెట్‌లో) హర్షిద్



తిరుపతిలో చిరుజల్లులు



ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఉపశమనం

తిరుపతి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా వడగాడ్పులు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు కొంత ఊరట లభించింది. శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన చిరు జల్లులు తిరుపతిలో కురిశాయి. రుతుపవనాల ప్రభావంతో రాత్రి 10 గంటల ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.ఉక్కపోతతో అల్లాడిపోతున్న వారికి ఉపశమనాన్ని కలిగించింది. మరోవైపు ఆకాశంలో మిరుమిట్లు గొలిపే మెరుపులు, వాటి వెంటే పెద్ద శబ్దాలు చేస్తూ ఉరుములు ఒకింత భయాందోళన కల్గించాయి. పాకాల మండలంతో పాటు పలు ప్రాంతాల్లో ఉరుములు,మెరుపులతో కూడిన వర్షం కురిసింది.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, జూన్ 1: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతుడై భక్తులకు దర్శనమిచ్చారు.ఉదయం 10.30 గంటలకు ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఊంజల్ సేవను నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, బంగారు తిరుచ్చిపై అధిష్ఠింపజేసి మాడ వీధుల్లో ఊరేగించారు. ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేదార్ చిరంజీవి పాల్గొన్నారు

మహిళలకు బ్యూటీపార్లర్‌పై శిక్షణ

చంద్రగిరి, జూన్ 1: చంద్రగిరి పట్టణం ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 7వ తేది నుంచి 30 రోజుల పాటు మహిళలకు ఉచితంగా బ్యూటీ పార్లర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుండి 45 సంవత్సరాల మధ్య వయసున్న మహిళలు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సెల్ నెంబర్ 7989680587లో సంప్రదించాలన్నారు.

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించండి:ఎస్పీ



చంద్రగిరి పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ రవికుమార్

చంద్రగిరి, జూన్ 1: పోలింగ్ రోజున జరిగిన హింసాత్మక సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, కౌంటింగ్ రోజున పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, ప్రజలు సహకరించాలని ఎస్పీ హర్షవర్ధనరాజు కోరారు. శనివారం రాత్రి చంద్రగిరిలో ఆయన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 144వ సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమల్లో వున్నాయని అందరూ గ్రహించి జాగ్రత్తగా వుండాలన్నారు.సోషల్ మీడియాలో రెచ్చగొట్టే మెసేజులు పెడితే కేసులు నమోదు చేస్తామన్నారు. శనివారం ఉదయం ఇన్‌చార్జ్ డీఎస్పీ రవికుమార్ చంద్రగిరి మండలంలో కవాతు నిర్వహించడంపై సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. ఎస్‌ఈబీ ఏఎస్పీ రాజేంద్ర, శాంతి భద్రతల ఏఎస్పీ కులశేఖర్, చంద్రగిరి సీఐ రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రాలతో దివ్యాంగులకు భవిష్యత్తు



సర్వేని పరిశీలిస్తున్న చంద్రశేఖర రెడ్డి

భాకరాపేట, జూన్ 1: భవిత కేంద్రాలతో దివ్యాంగులకు మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య కోఆర్డినేటర్ చంద్రశేఖర రెడ్డి అన్నారు. శనివారం దివ్యాంగులను భవిత కేంద్రాలలో చేర్పించడానికి నిర్వహిస్తున్న సర్వేని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రాలలో ప్రత్యేక విద్య ఉపకరణాలు, శారీరక వ్యాయామ శిక్షణ, ఇంటి వద్దనే విద్య, ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు ఎస్కార్ట్ అలవెన్స్, రవాణా చార్జీలు వంటివి అందించడం జరుగుతుందన్నారు.ఉపాధ్యాయులు వెంకటరమణ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల సందర్శన



పాకాల స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఈబీ ఏఎస్పీ రాజేంద్ర

పాకాల, జూన్ 1: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎస్ఈబీ అడిషినల్ ఎస్పీ రాజేంద్ర పాకాల మండలంలోని సమస్యాత్మక గ్రామాలను శనివారం సందర్శించారు. ఇన్‌చార్జ్ డీఎస్పీ రవి కుమార్, సీఐ రాజగోపాల్‌తో కలిసి సామిరెడ్డిపల్లె, పంటపల్లె, పులివర్తివారిపల్లెల్లో పర్యటించారు. ఎన్నికల ఫలితాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చర్చించారు.అనంతరం స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం షణ్ముగం

రామచంద్రాపురం, జూన్ 1 : ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులను ప్రోత్సహించాలని ఆ శాఖ డీపీఎం షణ్ముగం కోరారు. రాయలమండపం వద్ద ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా షణ్ముగం మాట్లాడుతూ జిల్లాలో ఆర్సీపురం మండలాన్ని ప్రకృతి వ్యవసాయ సాగులో ఆదర్శ మండలంగా ఎంపిక చేశామన్నారు. ఈ నెల 15న మండలంలోని ప్రకృతి వ్యవసాయక్షేత్రాలను సందర్శించడానికి ఇతర రాష్ట్ర బృందాలు రానున్నాయన్నారు. అడిషినల్ డీపీఎం పట్టాభిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలందరూ భవిత కేంద్రాల్లో నమోదు కావాలి



ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ చంద్రశేఖర రెడ్డి

ఎర్రావారిపాలెం, జూన్ 1 : మండలంలోని ప్రత్యేక అవసరాల పిల్లలందరినీ భవితా కేంద్రాల్లో చేర్పించాలని ఇంటిగ్రేటర్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ చంద్రశేఖర రెడ్డి సూచించారు. శనివారం ఆయన ఎర్రావారిపాలెం మండలంలోని నెరబైలు పంచాయతీ ఊటబావుల పల్లె లోని ప్రత్యేక అవసరాల విద్యార్థి ఇండ్ల వద్దకు వెళ్ళి తల్లిదండ్రులతో మాట్లాడారు. మండలంలో 52 మంది ఐఈ విద్యా అవసరమైన పిల్లను గుర్తించినట్లు తెలిపారు. ఐఈటీ టీచర్లు మండలవ్యాప్తంగా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వేలో గుర్తించిన ఐఈ పిల్లలందరినీ భవితా కేంద్రాల్లో చేర్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని సూచించారు. వారంతా సొంత కాళ్ళపై ఆధార పడి జీవనం సాగించేలా తర్ఫీదు ఇవాలని తెలిపారు. ఈ పర్యటనలో ఐఈఆర్‌టీ ఉపాధ్యాయురాలు మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాయినగర్‌లో దుర్గంధం



తిరుపతి రూరల్, జూన్ 1: తిరుపతి రూరల్ మండలం సాయినగర్ పంచాయతీ లోని కాలువల్లో మురుగు పేరుకుని దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు దోమలు పెరిగి స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇకనైనా ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

← కాలువల్లో పేరుకుపోయిన మురుగు

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి







శ్రీవారిమెట్టు మార్గంలో భక్తాంజనేయస్వామికి అభిషేకం - విశేషాలంకరణ - భక్తాంజనేయస్వామి ఊరేగింపు



తొండవాడలోని పంచముఖాంజనేయ స్వామికి పాలాభిషేకం

చంద్రగిరి, జూన్ 1: హనుమజ్జయంతి వేడుకలను శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.శ్రీవారిమెట్టు మార్గంలో వెలసిన భక్తాంజనేయస్వామి ఆలయంలో స్వామి విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.సాయంత్రం 4గంటలకు స్వామివారి పల్లకి ప్రాకారోత్సవం నిర్వహించారు.తొండవాడ సమీపంలోని ఉగ్రప్రత్యంగిరాదేవి ఆలయంలో ఆంజనేయస్వామి మూల విగ్రహానికి అభిషేకం, ఆలయ ఆవరణలోని 30 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామికి పాలాభిషేకం నిర్వహించారు.పూజారి సూరిస్వామి, శివశంకరప్రసాద్ పాల్గొన్నారు. చంద్రగిరి కోట గ్రామంలోని అభయవీరాంజనేయస్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. చంద్రగిరి పట్టణం జమండ్లవీధిలోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పాలాభిషేకం చేశారు.



చిన్నగొట్టిగల్లులో విశేషాలంకరణ

చిన్నగొట్టిగల్లులో....

భాకరాపేట, జూన్ 1: చిన్నగొట్టిగల్లు ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, విశేషాలంకరణ చేసి, పూజలు నిర్వహించారు.



పాకాలలో ప్రత్యేక అలంకరణ

పాకాలలో....

పాకాల, జూన్ 1: మండలంలో హనుమజ్జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. శంఖంపల్లె, కుక్కలపల్లె, బైనపల్లె, పాకాలలో ఆంజినేయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హనుమాన్ చాలీసా పఠించారు. ఈ వేడుకల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో....

రామచంద్రాపురం, జూన్ 1: మండలంలో హనుమ జయంతి సందర్భంగా పలు ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. రాయలచెరువుకట్ట శక్తిపీఠంలో వెలసిన అభయ ఆంజనేయస్వామికి తిరుమంజనం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి, శక్తిపీఠాధిపతి రమ్యానంద భారతి ఆధ్వర్యంలో లక్ష అరటిపండ్లను సమర్పించారు. రాయలచెరువుకట్ట కింద వెలసిన పురాతన యోగాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. బాదూరు, రాయలచెరువు చాయాపురం, నెత్తకుప్పం కట్ల కనుమ ఆలయాల్లో ఆంజనేయస్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ ఎస్వామి, ఉభయదాతలు కఠారి భాస్కర నాయుడు, శంకరయ్య, అబ్బు దేవరాజులునాయుడు, ఆలయధర్మకర్తలు ఉంగరాల సుబ్రహ్మణ్య శాస్త్రి, చెంగల్రాయులు పాల్గొన్నారు.



అరటి పండ్లతో అభయాంజనేయస్వామికి అలంకరణ

మధ్యాహ్న భోజన సిబ్బందికి శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎంఈవో సతీష్ బాబు

ఎర్రావారిపాలెం, జూన్ 1; ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే సిబ్బందికి శిక్షణా కార్యక్రమం ఎర్రావారిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగింది. పాఠశాలల్లో భోజనం వండేవారు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించాలని ఎంఈవో సతీష్ బాబు సూచించారు.భోజనం తయారీ ముందు ,వడ్డన ముందు సబ్బుతో చేతులు శుభ్రపరుచుకోవాలని తెలిపారు. కోడి గుడ్డు ఉడికించిన తరువాత పొట్టు వలిచి పిల్లలకు అందించాలని సూచించారు. పిల్లలందరికి సురక్షిత తాగునీరు అందు బాటులో ఉండేటట్లు చూడాలన్నారు.కూరలకు తాజా నాణ్యమైన కాయగూరలు వాడాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

తిరుపతి రూరల్, జూన్ 1: తిరుపతి రూరల్ మండలం పాతకాల్వలోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో సనాతనధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమజ్జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. అలాగే తుమ్మలగుంటలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ధర్మకర్త దొడ్డ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు అందజేశారు. పంచాయతీ పరిధిలో ఉప్పరపల్లె, హరిజనవాడలోని రామాలయాలు, మాతమ్మగుడి, కృష్ణుడి ఆలయం వద్ద భక్తులకు లడ్డు, పానకం పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు శ్రీనివాసులురాయల్, రేవంత్, భాస్కర్‌రెడ్డి, వరదరాజురాయల్, శ్రీను, కృష్ణ, చెంచుశేఖర్, అయ్యప్ప, సుమన్, బాలు, పవన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మంగళం: తిరుమలనగర్ పంచాయతీలో శ్రీభక్తి సిద్ధి ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో భక్తులకు అన్నదానం చేశారు. ధర్మకర్త రమేష్ పాల్గొన్నారు.



పాతకాల్వలోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు ←

తిరుపతి, చంద్రగిరిల్లో ఎస్పీ విస్తృత తనిఖీలు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 1: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో తిరుపతి, చంద్రగిరిలో ఎస్పీ శనివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కౌంటింగ్ దృష్ట్యా బాణసంచా విక్రయాలు పూర్తిగా నిషేధమన్నారు. తిరుపతి సబ్ డివిజన్ల పరిధిలోని కొర్లగుంట, చెన్నారెడ్డికాలనీ, పీర్ల చావిడి, ఎంఆర్‌పల్లె, వైకుంఠపురం, చెర్లోపల్లె తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేసి.. ప్రజలను అప్రమత్తం చేశారు. ఎక్కడైనా అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. చంద్రగిరిలో ప్రత్యేక పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ తనిఖీల్లో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



సీటీఎం వద్ద నెలకొల్పిన మదనపల్లె స్పిన్నింగ్ మిల్లు

పదేళ్ల పోరాటం..

- మదనపల్లె స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు బకాయిలు చెల్లింపు
- 42 ఏళ్ల తరువాత చేతులు మారింది..

మదపనపల్లె టౌన్, జూన్ 1: వేలాది మంది కార్మికుల కుటుంబాలకు జీవనోపాధి అందించిన మదనపల్లె స్పిన్నింగ్ (సీటీఎం) మిల్లు నేడు చేతులు మారింది. మిల్లు మూతపడినప్పటి నుంచి పదేళ్ల పాటు తమకు రావాల్సిన బకాయిలు కోసం పోరాడిన కార్మికులకు ఎట్టకేలకు శనివారం చెక్కులు పంపిణీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. 1972లో టీఎన్ కృష్ణారెడ్డి కుటుంబీకులు స్థాపించిన మదనపల్లె స్పిన్నింగ్ మిల్లులో మూడు షిఫ్టులుగా 1200 మంది కార్మికులు పనిచేసేవారు. ఇక్కడ పత్తి నుంచి తయారు చేసిన దారం విదేశాలకు సైతం ఎగుమతి చేసేవారు. అలాంటి స్పిన్నింగ్ మిల్లులో కార్మికుల మధ్య యూనియన్‌లు ఏర్పడి ఆధిపత్య పోరాటాలు చేసుకోవడం మొదలైంది. 2007 సంవత్సరంలో కార్మికుల మధ్య ఆధిపత్య పోరుతో హత్యాకాండకు కూడా దారి తీసింది. ఇలాంటి తరుణంలో అప్పటి యజమాన్యం నిర్వహణ లోపం, యూనియన్ల మధ్య గొడవల కారణంగా 2014లో మిల్లు మూతపడింది. 1200 మంది కార్మికుల్లో చాలామంది వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని మిల్లు యజమాన్యం ఇచ్చిన డబ్బులతో సంతృప్తి పడగా, మిల్లులో 30 ఏళ్లకు పైగా పనిచేసిన 308 మంది కార్మికులు ఇందుకు ఒప్పుకోలేదు. తమకు రావాల్సిన పీఎఫ్, జీతాల బకాయిలు చెల్లించాలని కోర్టుకు వెళ్లారు. పదేళ్లుగా కోర్టులో కేసు జరుగుతూనే ఉంది.

పదేళ్లకు కార్మికుల బకాయిలు చెల్లింపు

మదనపల్లె స్పిన్నింగ్ మిల్లును కర్ణాటక లిక్విడేటర్ వద్ద గత నెల 28వ తేదీ ఆన్‌లైన్ వేలంలో తిరుపతికి చెందిన గిరిధర్‌రెడ్డి అనే పారిశ్రామికవేత్త రూ.39 కోట్లకు కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో 308 మంది కార్మికులకు చెల్లించాల్సిన రూ.6.70 కోట్ల బకాయిల్లో రూ.4.51 కోట్లు కర్ణాటక లిక్విడేటర్ వద్ద డిపాజిట్ చేశారు. మిగిలిన రూ2.19 కోట్లు చెక్కుల రూపంలో కార్మికులకు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం మిల్లు ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో గిరిధర్‌రెడ్డి కార్మికులకు చెక్కులను పంపిణీ చేశారు. దీంతో పాటు కార్మికులకు చెల్లించాల్సిన ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించి రూ.1.10 కోట్లు విజయవాడ ఏఆర్‌సీ బ్యాంకు లిక్విడేటర్ వద్ద డిపాజిట్ చేసినట్లు తెలిసింది.

ఐదు గంటలు ఆలస్యంగా 'సెవెన్ హిల్స్'

- రైలు ప్రయాణికులకు చుక్కలు
- అర్ధరాత్రి స్టేషన్‌లో ప్రయాణికుల అవస్థలు

ములకలచెరువు, జూన్ 1: రైలు ప్రయాణికులకు చుక్కలు కన్పించాయి. సికింద్రాబాద్ నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్ రైలు ఐదు గంటలకు పైగా ఆలస్యంగా నడిచింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సికింద్రాబాద్ జంక్షన్ నుంచి కాచిగూడ, కర్నూల్, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం జంక్షన్, కదిరి, ములకలచెరువు, మదనపల్లె రోడ్, కలికిరి, పీలేరు, పాకాల జంక్షన్ మీదు గా వారానికి రెండుసార్లు సెవెన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ మార్గంలో నడుస్తుంది. ఈ క్రమంలో శనివారం నడిచిన సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆలస్యంగా నడిచింది. ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సిన ఈ రైలు ఉదయం 8.25 గంటలకు వచ్చింది. సాంకేతిక కారణాలతో ఈ రైలు సికింద్రాబాద్ జంక్షన్ నుంచే ఆలస్యంగా నడవడంతో ములకలచెరువు రైల్వేస్టేషన్‌కు వచ్చేసరికి ఐదు గం టలకుపైగా ఆలస్యమైంది. దీంతో ప్రయాణికులు రైలు కోసం గంటల తరబడిగా వేచి చేశారు. రాత్రివేళ కావడంతో రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు, తిరుపతికి వెళ్లే ప్రయాణికులకు చుక్కలు కన్పించాయి. తాగునీరు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. ఈ రైలు మదనపల్లె రోడ్‌కు తెల్లవారుజామున 3.19 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 9.03 గంటలకు, కలికిరికి తెల్లవారుజామున 3.49 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 9.28కు, పీలేరుకు తెల్లవారుజామున 4.09 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 9.40 గంటలకు, తిరుపతికి ఉదయం 6.25 గంటలకు వెళ్లాల్సి ఉండగా 11.29 గంటలకు వెళ్లింది. రైలు గంటల తరబడిగా ఆలస్యంగా నడవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

అలాగే నరసాపూర్ నుంచి ధర్మవరం జంక్షన్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు కూడా ఒకటిన్నర గంట ఆలస్యంగా నడిచింది. ఈ రైలు ములకలచెరువుకు ఉదయం 6.49 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 8.34 గంటలకు వచ్చింది.

'స్వతంత్ర' ఏజెంట్లపై సందిగ్ధత?

కలికిరి, జూన్ 1: మంగళవారం జరగనున్న ఎన్నికల లెక్కింపు కోసం ఇండిపెండెంట్ అభ్యర్థుల తరఫున ఏజెంట్లను అనుమతించాలా లేదా అనే విషయంపై సందిగ్ధత నెల కొంది. కౌంటింగ్ హాల్లో ఏజెంట్లకు కేటాయిస్తున్న వలయంలో ఎంత మంది కూర్చో వడానికి అనువుగా వుంటుందన్న విషయంలో ఇంకా స్పష్టత రాని నేపథ్యంలో ఇండిపెండెంట్ అభ్యర్థుల తరఫున ఏజెంట్లను అనుమతించే విషయమై అధికారులు స్పష్ట మైన హామీ ఇవ్వలేకున్నారు. జాతీయ, ప్రాంతీయ పార్టీ అభ్యర్థులు, గుర్తింపు పొందిన రిజిస్టర్డు పార్టీలు, గుర్తింపు లేని రిజిస్టర్డు పార్టీల అభ్యర్థులందరికీ ఏజెంట్లను అనుమ తించనున్నారు. కౌంటింగ్ కోసం ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్ల వంతున ఏర్పాటు చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపుకు అదనంగా నాలుగు టేబుళ్ళుంటాయి. మొత్తం మీద ఒక్కో అభ్యర్థికి 18 మంది ఏజెంట్లను అనుమతించాల్సి వుంటుంది. ఇండి పెండెంట్లతో కలిపి సరాసరిన 10 మంది అభ్యర్థులున్నా 180 మంది ఏజెంట్లను అను మతించాల్సి వుంటుంది. దీంతో ఇంత మంది ఏజెంట్లకు సరిపడా స్థలం, సౌకర్యాలు వుంటాయా అన్న విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు సహా ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా రిటర్నింగ్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. స్థలం, సౌకర్యాలు అందుబాటులో వుండే పరిస్థితులను బట్టి ఇండిపెం డెంట్ అభ్యర్థులను అనుమతించాలా వద్దా అనే విషయాన్ని రిటర్నింగ్ అధికారే నిర్ణయం తీసుకోనున్నట్లు చెపుతున్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కౌంటింగ్ హాలు లోపలికి వెళ్ళే ఏజెంట్లను రెండంచెల్లో క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు. సెల్ ఫోన్లు కూడా అనుమతించకుండా భద్రపరచడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. కేవలం పెన్ను, ఖాళీ పుస్తకం లేక ఖాళీ కాగితాలను మాత్రం అనుమతించ నున్నారు. ఈ సారి కొత్తగా ఏజెంట్లకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఏ మాత్రం మద్యం తీసుకున్నట్లు ఆనవాళ్ళు లభించినా వారిని ఎట్టి పరిస్థి తుల్లోనూ లోనికి అనుమతించరు. పోలీసులు అమలు చేస్తున్న కఠిన నిబంధనల కనువుగా అభ్యర్థులు కూడా తమ ఏజెంట్లను అప్రమత్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఈసారి జీతాల చెల్లింపునకు ఓకే

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 1: సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) ఉద్యోగులకు, జీపీఎఫ్ (జనరల్ ప్రావిడెంట్ ఫండ్) మినహాయింపులు లేని రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి మేనెల జీతాల చెల్లింపునకు ఖజానాశాఖ ఆమోదం తెలిపింది. ఇతర ఉద్యోగులతోపాటు వారికి ఈనెల జీతాలు పడతాయి. జనరల్ ప్రావిడెంట్ ఫండ్ మినహాయింపు లేని రెగ్యులర్ ఉద్యోగులు తమ మూలవేతనంలో కనీసం ఆరు శాతానికి తగ్గకుండా జీపీఎఫ్‌లో జమచేయని ఉద్యోగులకు మేనెల జీతాలు నిలిపివేయాలని ప్రభుత్వం వారం రోజుల ముందు ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా సీపీఎస్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులు పాన్ నంబర్ ఇవ్వకుండా తమ జీతాల నుంచి 10శాతం పే, డీఏ చెల్లించని వారి జీతాలు కూడా నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇట్టివారు జిల్లాలో సుమారు 600 మంది ఉద్యోగులు ఉన్నట్లు అంచనా. మరోవైపు ఎన్నికల విధుల్లో ఉన్న జీపీఎఫ్, సీపీఎస్ ఉద్యోగులందరికీ మేనెల జీతాలు చెల్లించాలని ప్రభుత్వం శనివారం ఆదేశాలు జారీ చేసింది. దాంతో వీరందరికీ జీతాలు అందుతాయి. జూన్ 15లోగా ఈ రెండు కేటగిరిలకు సంబంధించిన ఉద్యోగులు ఖజానా శాఖ అధికారులతో కలిసి పూర్తివివరాలు అందించాల్సి ఉంటుంది.

చిత్తూరు, తిరుపతి జిల్లాలకు ప్రత్యేకాధికారి నియామకం

చిత్తూరు, జూన్1: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో లా అండ్ ఆర్డర్ పర్యవేక్షణ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కేవీ మోహన్‌రావును నియమించింది.కౌంటింగ్ రోజున అల్లర్లు,ఘర్షణలు జరుగుతాయన్న అనుమానంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకాధికారులను నియమించింది.ఈ క్రమంలోనే పోలీసు శాఖలో ఐజీ కేడర్‌కు చెందిన మోహన్‌ను రెండు జిల్లాలకు లా అండ్ ఆర్డర్ పర్యవేక్షకులుగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

బాబు ఖచ్చితంగా సీఎం అవుతారు

● టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు



తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు నాయుడు మళ్లీ సీఎం అవుతారు. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. ఖచ్చితంగా సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారు' అని టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు ధీమా వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారిని శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తన పెళ్లిరోజు సందర్భంగా శ్రీవారిని దర్శించుకున్నట్టు తెలిపారు. ఐదేళ్లలో రాష్ట్రం సర్వనాశనమై పోయిందన్నారు. అన్నివర్గాల ప్రజలు ఇబ్బందిపడటంతోపాటు అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. బాబు ఖచ్చితంగా సీఎం అవుతారని, ఈ వయస్సులో ఆయనకు మంచి ఆరోగ్యాన్నిచ్చి, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే ధైర్యం, శక్తినివ్వాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు.

అమ్మవారి సేవలోనూ..

తిరుచానూరు: పద్మావతి అమ్మవారిని అయ్యన్నపాత్రుడు తన సతీమణితో కలిసి దర్శించుకున్నారు. ఆలయ వేదపండితులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

పవన్‌కల్యాణ్ భారీ మెజార్టీతో గెలవాలని..

పొర్లుదండాలతో జపాలి మెట్లెక్కిన అభిమాని



పొర్లుదండాలతో జపాలికి వెళుతున్న ఈశ్వర్

తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ భారీ మెజార్టీతో గెలవాలని కోరుకుంటూ ఓ అభిమాని జపాలి మెట్లను పొర్లుదండాలతో ఎక్కి అభిమానాన్ని చాటుకున్నాడు. చంద్రగిరి మండలంలోని బలిజపల్లికి చెందిన ఈశ్వర్.. పవన్‌కల్యాణ్ వీరాభిమాని. పిఠాపురం నుంచి జనసేనాని ఎమ్మెల్యేగా పోటీ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఈనెల నాల్గవ తేదీన ఫలితాలు రానున్న నేపథ్యంలో పొర్లుదండాలతో జపాలికి చేరుకుని, ఆంజనేయస్వామిని దర్శించుకోవాలని నిర్ణయించుకున్నాడు. శనివారం హనుమజ్జయంతి కావడంతో ఉదయం 10 గంటలకు మొదటిమెట్టు వద్ద కర్పూరం వెలిగించి, పొర్లుదండాలు చేసుకుంటూ వెళ్లి, ఆంజనేయస్వామిని దర్శించుకున్నాడు. ఈసందర్భంగా ఈశ్వర్ మీడియాతో మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ భారీ విజయాన్ని అందుకోవాలని పొర్లుదండాలు చేశానన్నారు. అలాగే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడాలని కోరుకున్నట్టు చెప్పారు.

ఘనంగా ప్రపంచ పాల దినోత్సవం



మజ్జిగ పంపిణీ చేస్తున్న రవికుమార్, నాగేశ్వరరావు తదితరులు

తిరుపతి రూరల్, జూన్ 1: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని డెయిరీ టెక్నాలజీ కళాశాల, ఇండియన్ డెయిరీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పాల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులతో కలసి ఎస్వీయూ నుంచి గాంధీరోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్వీయూ ప్రధాన ద్వారం ఎదుట ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఏపీచాప్టర్ అధ్యక్షుడు రవికుమార్, ప్రధానకార్యదర్శి కె.నాగేశ్వరరావు ప్రసంగించగా, అసోసియేట్ డీన్ వై.రవీంద్రారెడ్డి, అధ్యాపకులు మంజునాథ్, విజయగీత,రవివర్మ, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తిరుపతి(వైద్యం), జూన్ 1: ఎస్వీ వైద్య కళాశాలలో 2003లో వైద్య విద్య పూర్తి చేసిన 120 మంది పూర్వ విద్యార్థులు శనివారం సమావేశమయ్యారు. తాము చదువుకున్న నాటి రోజులను గుర్తుచేసుకుని సందడి చేశారు. కళాశాల అభివృద్ధికి తమ వంతు సాయాన్ని అందిస్తామని తెలిపారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఐఏఎస్, ఐపీఎస్‌లైన డాక్టర్ రూపేష్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ జయచంద్రభాను, హేమేంద్రనాథ్, డాక్టర్ భాను ఆధ్వర్యంలో నిర్వహించారు.

శిక్షణ కేంద్రం ప్రారంభం



బాలుడిని పరామర్శించిన మేయర్ శిరీష

తిరుపతి అర్బన్, జూన్ 1: అబ్బన్నకాలనీలో బుద్ధిమాంద్యం పిల్లలకు అవసరమైన శిక్షణ కేంద్రాన్ని శనివారం ఉదయం మేయర్ శిరీష ప్రారంభించారు. కేంద్రం నిర్వాహకులు, మానసిక వైద్యనిపుణులు డాక్టర్.కె.కవిత, డాక్టర్.ఎస్.భారతి ప్రసంగించగా, వైద్యులు కిషోర్, మల్లికార్జునరావు, జాహ్నవి, తదితరులు పాల్గొన్నారు.

రైలుకిందపడి ఆత్మహత్య



తిరుపతి(నేరవిభాగం), జూన్ 1: రైలుకిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రవి తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి- పాకాల వెళ్లే మార్గంలో శుక్రవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో శనివారం మృతదేహాన్ని రుయాస్పత్రికి రైల్వే పోలీసులు తరలించారు. సంఘటనా స్థలంలో ఎలాంటి వ్యక్తిగత ఆధారాలు లభ్యం కాలేదని, ఆచూకీ తెలిసినవారు 88867 81045 నెంబరుకు ఫోన్ చేయాలని రైల్వే పోలీసులు కోరారు.

చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించండి



చిన్నపిల్లల విభాగాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ వెంకట్ కిరణ్

తిరుపతి (వైద్యం), జూన్ 1: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు ఎన్‌హెచ్ఎం ఏపీ స్టేట్ ప్రోగ్రాం మేనేజరు డాక్టర్ వెంకట్ కిరణ్ సూచించారు. రుయాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగం పరిధిలో ఉన్న డీఈఐసీ భవనాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలకు అందిస్తున్న వైద్యం, పరికరాల గురించి విభాగాధిపతి డాక్టర్ మనోహర్‌ను అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, డీపీఎంవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మిగులు సీట్లకు దరఖాస్తు చేసుకోండి

కోట, జూన్ 1: తిరుపతి జిల్లాలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ కె.నారాయణరావు తెలిపారు. జిల్లాలోని ఆయా గురుకులాల్లో 6,7,8 తరగతుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. ఆయా సీట్లలో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 5నుంచి 15వ తేదీ వరకు గురుకులం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 20న ఆయా తరగతుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కన్వీనర్ నారాయణరావు కోరారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 207 మంది హాజరు

తిరుపతి(విద్య), జూన్ 1: ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. శనివారం 75001 నుంచి 92000 ర్యాంకుల మధ్య ఉన్న విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరిగిందని, మొత్తం 207 మంది హాజరయ్యారని కోఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఆదివారం 92001 నుంచి 108000 ర్యాంకుల మధ్య ఉన్న విద్యార్థులకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ జి.కృష్ణమూర్తినాయుడు, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ ఎస్.సుధీర్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో..



హనుమంతవాహనంపై విహరిస్తున్న రామచంద్రమూర్తి

తిరుపతి (కల్చరల్): తిరుపతి కోదండరామస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి గుడిలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు సీతారామలక్ష్మణ స్వామి ఉత్సవమూర్తులను ఆంజనేయస్వామి గుడికి వేంచేపు చేశారు. అనంతరం ఆంజనేయస్వామి మూలవర్లకు, సీతారామ, లక్ష్మణ స్వామి వార్లకు అభిషేకం నిర్వహించారు. రాత్రి ఏడు నుంచి 8.30 గంటలవరకు రామచంద్రమూర్తి హనుమంతవాహనంపై నాలుగు మాడవీధులలో విహరించి, భక్తులకు కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ప్రధాన అర్చకుడు ఆనంద్‌కుమార్ దీక్షితులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా, రాములవారి దక్షిణమాడవీధిలో ఉన్న చిగారో ఆధ్యాత్మిక కేంద్రంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకం వేంకట పెరుమాళ్ దీక్షితులు, గుండాల గోపీనాథ్‌రెడ్డి, సీఆర్‌కే శేషగిరిరావు, లక్ష్మీరంగనాథం భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా హనుమజ్జయంతి

ఆకాశగంగలో బాలాంజనేయస్వామికి శాస్త్రోక్తంగా సుమల్లికార్చన



తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి. ముందుగా ఆకాశగంగలో అంజనాదేవికి, బాలాంజనేయస్వామికి శ్రీవారి ఆలయం నుంచి విశేషమైన శేషవస్త్రాలు టీటీడీ ఈవో ధర్మారెడ్డి సమర్పించారు. హనుమంతుని జన్మ విశేషాలతో ప్రారంభమైన, ఉపచారాలు, పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహించారు. లోక క్షేమంకోసం స్వామికి ఎంతో ప్రీతిపాత్రమైన మల్లెలతో సహస్రనామ అర్చన నిర్వహించారు.

ఆకాశగంగ తీర్థంలో అమ్మవారికి అభిషేకం

కిక్కిరిసిన జపాలి





జపాలిలో మూలవిరాట్, భక్తుల రద్దీ

హనుమజ్జయంతి సందర్భంగా తిరుమలలోని జపాలి క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. శుక్రవారం రాత్రి నుంచే భక్తులు భారీగా చేరుకోవడం క్షేత్రం రద్దీగా మారింది. శనివారం ఉదయం ఆలయంలో అభిషేకాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటలకు టీటీడీ తరఫున ఈవో పట్టువస్త్రాలు సమర్పించారు. ఆదివారం ధర్మగిరి వేదపాఠశాలలలో సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం జరుగుతుందని ఈవో తెలిపారు. 2,823 శ్లోకాలను పండితులు నిరంతరాయంగా 18 గంటలపాటు పా రాయణం చేస్తారన్నారు. అలాగే శ్రీవారి ఆలయం ముందున్న బేడి ఆంజనేయస్వామి ఆలయంలోనూ ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం మొదటిఘాట్‌లోని ఏడో మైలు ప్రసన్న ఆంజనేయస్వామి వద్ద కూడా పూజలు జరిగాయి. ఇక, శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనానికి నిత్యం పరదాలు ఇచ్చే తిరుపతికి చెందిన మణి జపాలి హనుమంతునికి కూడా పరదాలు అందజేశారు. హథీరాంజీ మఠం మహంతు ఓం ప్రకాష్ దాస్‌జీ, వైఖానస ఆగమ సలహాదారు మోహనరంగాచార్య, డిప్యూటీఈవోలు లోకనాథం, సెల్వం, పారుపత్తేదార్ తులసీ ప్రసాద్, ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠం పండితులు పాల్గొన్నారు.



హనుమాన్ మాల ధరించిన భక్తులు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

సర్వ విద్యాప్రదాత హనుమంతుడు

సువిద్యేంద్రతీర్థ స్వామి



తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): హనుమంతుడు సర్వ విద్యాప్రదాతని బెంగళూరు రాఘవేంద్ర స్వామి మఠాధిపతి సువిద్యేంద్రతీర్థ స్వామి అన్నారు. హనుమజ్జయంతి సందర్భంగా శనివారం తిరుమలలోని నాదనీరాజనం వేదిక, ఆకాశగంగ, జపాలితీర్థంలో నిర్వహించిన భక్తిసంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా సువిద్యేంద్ర తీర్థ స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ.. మహావిష్ణువు సకల విద్యలను సూర్యుడికి బోధించాడని, సూర్యుడు సకల విద్యలను హనుమంతుడికి బోధించినట్లు వివరించారు. అనంతరం ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రత్యేకాధికారి విభీషణ శర్మ.. స్వామిని సత్కరించారు.

తొలిసారిగా మాల్‌పూరి ప్రసాదం





మాల్‌పూరిని చూపుతున్న రమేష్

దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జపాలిలో ఆంజనేయస్వామి ఆలయంలో తొలిసారిగా మాల్‌పూరి ప్రసాదాన్ని విక్రయిస్తున్నట్టు హథీరాంజీ మఠం పరిపాలన అధికార రమేష్ తెలిపారు. హనుమజ్జయంతి సందర్భంగా ఈప్రసాదాన్ని ప్రవేశపెట్టామన్నారు. శనివారం నుంచి రోజూ ప్రత్యేక కౌంటర్ ద్వారా రూ.20 చొప్పున మాల్‌పూరి ప్రసాదాన్ని విక్రయిస్తామన్నారు.

ఫ్లైఓవర్‌పై మొరాయించిన 108 వాహనం



తిరుపతి(వైద్యం), జూన్ 1: రేణిగుంట నుంచి తిరుపతి నగరంలోకి వస్తుండగా ఫ్లైఓవర్‌పై శనివారం ఓ 108 వాహనం మొరాయించింది. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగిని డక్కిలి మండలం నుంచి స్విమ్స్ ఆస్పత్రికి తీసుకొస్తుండగా గేర్‌బాక్స్ సమస్య తలెత్తడంతో వాహనం ఆగిపోయింది. వాహనంలోని బాధితులను మరో వాహనంలో స్విమ్స్‌కు తరలించారు. అనేక 108 వాహనాలు ఇలాగే తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాగా, మరమ్మతులకు గురైన 108 వాహనం కిటికీల అద్దాలు కూడా వేయకుండా దాదాపు రెండు గంటలపాటు ఫ్లైఓవర్‌పై వదిలేయడాన్ని పలువురు విమర్శిస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.93 కోట్లు

తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.93 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 67,873 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 33,532 మంది తలనీలాలు సమర్పించారు.

టీటీడీ అన్నప్రసాద ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. చెన్నైకి చెందిన కిరోరిమల్ కాశీరామ్ మార్కెటింగ్ అండ్ ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ విరాళాన్ని అందించింది. శ్రీవారి ఆలయం ముందు సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర ఈ విరాళం డీడీలను టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

ఎన్డీఏ కూటమి గెలవాలని..

అలిపిరిలో శ్రీవారికి కొబ్బరికాయలు సమర్పించిన టీడీపీ నాయకులు



తిరుపతి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి భారీ మెజారిటీతో గెలవాలని.. తిరుపతి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగుణమ్మ ఆధ్వర్యంలో శనివారం అలిపిరి పాదాలమండపం వద్ద నాయకులు కొబ్బరికాయలు కొట్టి వేడుకున్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని స్వామిని ప్రార్థించినట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు వట్టికుంట చినబాబు, సింగంశెట్టి సుబ్బరామయ్య, రుద్రకోటి సదాశివం, పాటకం వెంకటేష్, రామ్మూర్తి రాయల్, ఆముదాల తులసీరాం, శాంబోళ హరనాథ్, కరాటే చంద్ర, గుణశేఖర్ నాయుడు, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎగ్జిట్ పోల్ సర్వేలో ఎన్డీఏ కూటమి అంచనాలకు దగ్గరగా చేరడంపై తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపులో ఎన్డీఏ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరన్నారు.

క్యాన్సర్ నివారణకు అధునాతన వైద్య పద్ధతులు

తిరుపతి(వైద్యం), జూన్ 1 : క్యాన్సర్ నివారణకు అధునాతన వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయని రేడియేషన్, సర్జికల్ ఆంకాలజీ విభాగం డాక్టర్లు ప్రాణబంధు దాస్, వినోదిని తెలిపారు. స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో శనివారం పాథాలజీ, సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సీఎంఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్ల, వైద్య విభాగాధిపతులు రుక్మాంగధ, నరేంద్ర, సుబ్రమణియన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో మధ్యప్రదేశ్ సీఎం



మోహన్ యాదవ్

తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, ఎమ్మెల్యే బాలవీరాంజనేయులు, ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, ఉదయగిరి కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్, చిత్తూరు అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



చంద్రబాబుకు శ్రీవారి ప్రసాదాలు

తిరుపతి (జీవకోన), జూన్ 1: టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబును తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు శనివారం కలిశారు. శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

తెలుగు రచయితల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా కన్నయ్య

తిరుపతి అర్బన్, జూన్ 1: తెలుగు రచయితల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా టీటీడీ ఉద్యోగి పాలకూరు కన్నయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం జాతీయ అధ్యక్షుడు డాక్టర్.సి.నారాయణస్వామి ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా కన్నయ్య మాట్లాడుతూ.. తెలుగుభాష పరిరక్షణకు అంకితభావంతో తనవంతు కృషి చేస్తానన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడికి శాశ్వత అంగవైకల్యం

ఆసుపత్రిలో 12 రోజులుగా చికిత్స ● రెండు కాళ్లు తీసేసిన వైద్యులు


చికిత్స పొందుతున్న భరత్‌కుమార్

పెళ్లకూరు, జూన్ 1: విద్యుదాఘాతం కారణంగా ఓ బాలుడికి శాశ్వత అంగ వైకల్యం ఏర్పడింది. పెళ్లకూరు మండలం చిల్లకూరు దళితవాడకు చెందిన నెలబల్లి మహేష్, భువనేశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులు. మహేష్ ఆటో డ్రైవర్. వేసవి సెలవులు కావడంతో 9వ తరగతి చదువుతున్న పెద్ద కుమారుడు భరత్‌కుమార్ కాలనీ సమీపంలో గత నెల 19న పిల్లలతో కలసి క్రికెట్ ఆడుకోవడానికి వెళ్లారు. ఈ క్రమంలో బాల్ సమీపంలోని పాత పరిశ్రమ ఆవరణలో పడింది. దాన్ని తెచ్చేందుకు భరత్ కుమార్ ప్రహరీని ఎక్కి దాటే సమయంలో కిందకు వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి విద్యుదా ఘా తానికి గురయ్యాడు. దీంతో బాలుడి రెండు కాళ్లు, చేతులు కాలి పోయాయి. తల్లిదండ్రులు బాలుడిని చికిత్స నిమిత్తం తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలో భాగంగా శనివారం వైద్యులు భరత్‌కుమార్‌కు రెండు కాళ్లు తొలగించారు. దీంతో పద్నాలుగేళ్లకే శాశ్వత అంగ వైకల్యం చెంది మంచానికే పరిమితం కానున్న కుమారుడిని చూసి తల్లిదండ్రులు భోరున విలపిస్తున్నారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతో జరిగిన ఘటనపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చేపల మార్కెట్‌లో అగ్ని ప్రమాదం


అగ్నిప్రమాదంలో దగ్ధమైన తాత్కాలిక చేపల దుకాణాలు

గూడూరు, జూన్ 1: పట్టణంలోని ఐసీఎస్‌రోడ్డులో తాత్కాలిక చేపల మార్కెట్‌లో శనివారం వేకువ జామున అగ్నిప్రమాదం జరిగి నాలుగు దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపకశాఖ అధికారి చలమయ్య వివరాల మేరకు... మార్కెట్‌లో మంటలు చెలరేగడాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే తమకు సమాచారం అందించారన్నారు. దీంతో సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశామన్నారు. ఈ ప్రమాదంలో గోపికృష్ణ, బుజ్జమ్మ, పద్మమ్మ, శేషమ్మకు చెందిన దుకాణాలు దగ్ధమయ్యాయన్నారు. సుమారు రూ.8లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు పేర్కొన్నారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గూడూరు అర్బన్, జూన్ 1: మండలంలోని నెల్లటూరు గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. 50 ఏళ్ల వ్యక్తి మృతి చెందినట్టు పోలీసులు గుర్తించారు. మృతదేహంపై నలుపురంగు నిక్కరు ఉంది. రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నాయకుడికి బీదా పరామర్శ

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం


వెంకటేశ్ యాదవ్‌ను పరామర్శిస్తున్న బీదా తదితరులు

సూళ్లూరుపేట, జూన్ 1: టీడీపీ సానుభూతి పరుడు వెంకటేశ్ యాదవ్ వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందిస్తామని టీడీపీ జాతీయ కార్యదర్శి బీదా రవిచంద్ర భరోసా ఇచ్చారు. గత ఏడాది వైసీపీ శ్రేణుల దాడిలో తీ వ్రంగా గాయపడిన వెంక టేశ్ నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. తలకు శస్త్రచికిత్స చేయించుకుంటున్న వెంకటేశ్‌ను శుక్రవారం రాత్రి బీదా పరామర్శించారు. ప్రస్తుతం వైద్యానికి అయ్యే ఖర్చుల కు తానే అందిస్తానని భరోసా ఇచ్చారు. ఇంకా మెరుగైన చికిత్సకు అయ్యే ఖర్చులను పార్టీ భరిస్తుందని తెలిపారు. ఆయన వెంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, మేడా సాయి నారాయణ, ఆలీ బాయ్, శ్రీధర్, సత్యనారాయణ తదితరలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

తడ, జూన్ 1: రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని ఇరకంకుప్పానికి చెందిన రాజివేలు శుక్రవారం పని మీద గుమ్మిడిపూండికి వెళ్లాడు. అదే రోజు రాత్రి మెమోలో తడకు వచ్చాడు. రైల్వేస్టేషన్ రోడ్డులో నడుచుకుని వెళ్తుండగా బైక్ ఢీకొనింది. ఈ ప్రమాదంలో రాజివేలు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనికి ప్రథమ చికిత్స అందించి చెన్నైకు తరలించారు. అలాగే స్థానిక సుజాతనగర్‌లో నివాసముంటున్న రోశయ్య శనివారం సాయంత్రం ఇంటి నుంచి స్థానికంగా ఉన్న ఓ అపార్ట్‌మెంటుకు పని మీద బయలుదేరాడు. జాతీయ రహదారి దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్లే రోడ్డులో గుర్తు తెలియని బైక్ అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను కిందపడి పోవడంతో అదే సమయంలో అటుగా వెళ్తున్న కారు మరోసారి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 సిబ్బంది సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.93 కోట్లు

తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.93 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 67,873 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 33,532 మంది తలనీలాలు సమర్పించారు.

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. చెన్నైకి చెందిన కిరోరిమల్ కాశీరామ్ మార్కెటింగ్ అండ్ ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ విరాళాన్ని అందించింది. శ్రీవారి ఆలయం ముందు సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర ఈ విరాళం డీడీలను టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

పవన్‌కల్యాణ్ భారీ మెజార్టీతో గెలవాలని..

పొర్లుదండాలతో జపాలి మెట్లెక్కిన అభిమాని



తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ భారీ మెజార్టీతో గెలవాలని కోరుకుంటూ ఓ అభిమాని జపాలి మెట్లను పొర్లుదండాలతో ఎక్కి అభిమానాన్ని చాటుకున్నాడు. చంద్రగిరి మండలంలోని బలిజపల్లికి చెందిన ఈశ్వర్.. పవన్‌కల్యాణ్ వీరాభిమాని. పిఠాపురం నుంచి జనసేనాని ఎమ్మెల్యేగా పోటీ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఈనెల 4న ఫలితాలు రానున్న నేపథ్యంలో పొర్లుదండాలతో జపాలికి చేరుకుని, ఆంజనేయస్వామిని దర్శించుకోవాలని నిర్ణయించుకున్నాడు. శనివారం హనుమజ్జయంతి కావడంతో ఉదయం 10 గంటలకు మొదటిమెట్టు వద్ద కర్పూరం వెలిగించి, పొర్లుదండాలు చేసుకుంటూ వెళ్లి, ఆంజనేయస్వామిని దర్శించుకున్నాడు. ఈసందర్భంగా ఈశ్వర్ మీడియాతో మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ భారీ విజయాన్ని అందుకోవాలని పొర్లుదండాలు చేశానన్నారు.

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు


గూడూరు చెన్నకేశవ ఆలయంలోని హనుమంతుడికి వడల అలంకరణ- చిల్లకూరు అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు - ప్రత్యేక అలంకరణలో వెంకటగిరి పాతకోట వీరాంజనేయస్వామి - సూళ్లూరుపేటలో బాలాంజనేయస్వామికి తమలపాకుల లక్షార్చన - నాయుడుపేటలోని అగ్రహారపేట ఆంజనేయుడికి అభిషేకం

గూడూరు, జూన్ 1: పట్టణంలోని పలు ఆలయాల్లో శనివారం హనుమజ్జయంతి సందర్భంగా వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కోనేటిమిట్టలోని కోదండ రామాంజనేయస్వామి ఆలయంలో హనుమంతుడిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని అష్టోత్తర శతసహస్ర నాగవల్లీ దళ సామూహిక పూజలు, హనుమాన్‌చాలీసా పారాయణం తదితరాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నదానం జరిగింది. సిరామిక్ కళాశాల రోడ్డులోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో, చెన్నకేశవస్వామి ఆలయంలో, తమ్మిశెట్టిగుంట ఆంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మాళవ్యానగర్‌లోని శ్రీరామ రక్షా కుటీరంలో హనుమజ్జయంతిని వైభవంగా నిర్వహించారు. విష్ణుసహస్రనామ పారాయణం, శ్రీరామపట్టాభిషేకం, పుష్పయాగం పూజా కార్యక్రమాలను జరిపారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని బాలాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు శనివారం నుంచి ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 5వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు దీవి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు హనుమంతుడికి లక్ష తమలపాకులతో అర్చన చేశారు. ఆలయ ప్రాంగణంలో స్వామివారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి పుష్పాలతో అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేసి భక్తులచే లక్ష తమలపాకులతో అర్చన చేశారు. అదే విధంగా చెంగాళమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న అభయ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద సహాయ కమిషనర్ డి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎం.వెంకటేశ్వర్లు రెడ్డి, ఐ.శ్రీధర్, కె.శ్రీరామ్మూర్తి సహా ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని అగ్రహారపేటలో కొలువై ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం ఆంజనేయస్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సింధూరంతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సహస్రనామార్చన, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయ దాతలుగా అమర్‌నాథరెడ్డి దంపతులు వ్యవహరించారు.

చిల్లకూరు: మండలంలో ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమజ్జయంతి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు.చిల్లకూరులోని అభయాంజనేస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు జరిపారు. అదేవిధంగా కలవకొండ, ఏరూరు, కడివేడు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు జరిపారు. కలవకొండలో స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఆయా ఆలయాల్లో భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోట: మండలంలోని వంజివాక, గూడలి, దక్షిణ పాలెం, కేశవరం గ్రామాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అంజనీపుత్రుడి జయంతి సందర్భంగా ఆయా గ్రామాల్లోని విగ్రహాలకు అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పలు గ్రామాల్లో భక్తులకు అన్నదానం జరిగింది. ఆంజనేయస్వామి చిత్రపటాలతో గ్రామోత్సవాలు జరిగాయి.

వెంకటగిరి టౌన్: పట్టణంలో హనుమజ్జయంతి వేడుకలు స్వామి వివేకానందా యువసైన్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 1116 హనుమాన్ జెండాలు, స్టిక్కర్లు పంపిణీ చేయడమేకాకుండా అన్నదానం చేసినట్టు ఏపీపీ ప్రకృతికుమార్ చెప్పారు. అదే విధంగా పాతకోటలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించాల్సిన హనుమజ్జయంతి ర్యాలీ ఎన్నికల కోడ్ కారణంగా 9వ తేదికి వాయిదా వేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

సూళ్లూరుపేటకు జలగండం

డెడ్ స్టోరేజీకి చేరిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్


అడుగంటిన పిండిపాలెం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు


నెర్రెలు బారిన ఎస్ఎస్ ట్యాంకు

సూళ్లూరుపేట, జూన్ 1: సూళ్లూరుపేటలో నీటి కష్టాలు పెరుగుతున్నాయి. పిండిపాలెం వద్దనున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ డెడ్ స్టోరేజీకి చేరింది. తల్లంపాడు వద్ద డైరెక్టు పంపింగ్ ద్వారా అందించే తాగునీటి పథకం అంతంత మాత్రంగానే పనిచేస్తుండడం, రూ.162 కోట్లతో నిర్మిస్తున్న నీటి పథకం పనులు నిలిచిపోవడంతో రాబోయే రోజుల్లో పట్టణంలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చనుంది. 59,203మంది జనాభా ఉన్న సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో నీటి పథకాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవడంపై అధికారులు,పాలకులు నిర్లక్ష్యం వహించడంతో పట్టణవాసులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. పిండిపాలెం వద్దనున్న సమ్మర్ స్టోరేజ్ నుంచి, తల్లంపాడు చెరువు వద్ద నుంచి డైరెక్టు పంపింగ్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పిండిపాలెం వద్దనున్న ఎస్ఎస్ ట్యాంకు సామర్థ్యం 720ఎంఎల్ అయితే ప్రస్తుతం 50 ఎంఎల్ మాత్రమే నీరు నిల్వ ఉంది.వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటిని నిల్వ చేయాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టలేదు. ఎప్పుడూ లేని విధంగా గత ఏడాది డిసెంబరులో వరదలు రావడంతో కాళంగి నదికి వరదనీరు చేరి మార్చి వరకు కూడా కాళంగికి అను సంధానమైన నెర్రికాలువలో పుష్కలంగా నీరు ప్రవహించింది. నెర్రి కాలువ నీటిని ఎస్ఎస్ ట్యాంకులోకి లిఫ్టు చేయకపోవడంతో నీటి సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయింది.తల్లంపాడు చెరువులో నీటి పథకాలు తరచూ మొరాయిస్తున్నాయి.సరిపడా నీటి సరఫరా లేకపోవడంతో పట్టణవాసులు నీటి అవసరాల కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ ట్యాంకర్లు, మినరల్ క్యాన్లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆగిన రూ.162 కోట్ల పనులు..

సూళ్లూరుపేట దాహార్తి తీర్చేందుకు ఏఐఐబీ సాయంతో రూ.162 కోట్లతో మంగళంపాడు చెరువులో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. అక్కడ నుంచి పైపులైన్ల ద్వారా పట్టణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని నింపి ప్రతి ఇంటికి తాగునీరందించాలనే లక్ష్యంతో మొదలైన పనులు మొదట వేగంగా జరిగినా తరువాత మందగించాయి.కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు మధ్యలోనే పనులు నిలిపివేసి వెళ్లారు.అయినా దీని గురించి పాలకులు, అధికారులు పట్టించుకోలేదు.

నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు


సిబ్బందికి సూచనలిస్తున్న అర్బన్ సీఐ

నాయుడుపేట టౌన్, జూన్ 1: ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పట్టణంలోని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ ఇంటివద్ద పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా సీసీ కెమెరాను అమర్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... ఓట్ల లెక్కింపు సందర్భంగా సమావేశాలు, విజయోత్సవ ర్యాలీల నిషేధమన్నారు.


విజయశ్రీ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

మొక్కుబడిగా మండల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

దొరవారిసత్రం, జూన్ 1: దొరవారిసత్రం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మొక్కుబడిగా జరిగింది. మండల సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశానికి ఎంపీపీ డి.సుజాతమ్మ అధ్యక్షత వహించారు. తాగునీటి ఎద్దడిపై మొక్కుబడి చర్చ జరిపారు. పలువురు సర్పంచులు హాజరుకాలేదు. ఎంపీటీసీ సభ్యుల స్థానంలో వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అలాగే సమావేశంలో పలువురు వైసీపీ నాయకులు కూడా పాల్గొన్నారు. దాంతో మండల మీట్ నియమావళిని పాటించని సమావేశంగా జరిగింది. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు రమేష్, ఉప ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో శివరాజ్, తహసీల్దార్ ప్రసాద్, వ్యవసాయాధికారి జ్యోతిర్మయి, ఏఈ కస్తూరయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి గుంటలో పడి ఒకరి మృతి

చిల్లకూరు, జూన్ 1: మండలంలోని చింతవరం సమీపంలోని నీటిగుంటలో పడి శనివారం ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు... చింతవరానికి చెందిన మస్తానయ్య(50) గ్రామానికి సమీపంలోని నీటిగుంట వద్దకు బట్టలు ఉతికేందుకు వెళ్లాడు. ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారీ నీటిగుంటలో పడి మృతి చెందాడు. మస్తానయ్య ఎంతకీ ఇంటకి రాకపోవడంతో కుటుంబీకులు గాలించగా గుంటలో తేలుతుండడాన్ని గుర్తించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్యాన్సర్ నివారణకు అధునాతన వైద్య పద్ధతులు

తిరుపతి(వైద్యం), జూన్ 1 : క్యాన్సర్ నివారణకు అధునాతన వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయని రేడియేషన్, సర్జికల్ ఆంకాలజీ విభాగం డాక్టర్లు ప్రాణబంధు దాస్, వినోదిని తెలిపారు. స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో శనివారం పాథాలజీ, సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సీఎంఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్ల తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రం ప్రారంభం

తిరుపతి అర్బన్, జూన్ 1: అబ్బన్నకాలనీలో బుద్ధిమాంద్యం పిల్లలకు అవసరమైన శిక్షణ కేంద్రాన్ని శనివారం ఉదయం మేయర్ శిరీష ప్రారంభించారు. కేంద్రం నిర్వాహకులు, మానసిక వైద్యనిపుణులు కె.కవిత, ఎ్‌.భారతి ప్రసంగించగా, వైద్యులు కిషోర్, మల్లికార్జునరావు, జాహ్నవి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం డీఏవోగా గోపాలకృష్ణ



సూళ్లూరుపేట, జూన్ 1: సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయ డీఏవోగా తహసీల్దార్ కే.వీ. గోపాలకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డీఏవో పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో సూళ్లూరుపేట తహసీల్దార్‌గా ఉన్న గోపాలకృష్ణకు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి బాధ్యతలు తీసుకొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

సూళ్లూరుపేట, జూన్ 1: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఇన్‌చార్జి ఎస్ఐ కొండప్ప సమాచారం మేరకు... ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంలో కూర్చొని ఉన్న వ్యక్తి మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బతో మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేవు. ఎరుపు రంగు లుంగీ, కాఫీ కలర్ గల్ల చొక్కా ధరించి ఉన్నాడని, వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లైఓవర్‌పై మొరాయించిన 108 వాహనం

తిరుపతి(వైద్యం), జూన్ 1: రేణిగుంట నుంచి తిరుపతి నగరంలోకి వస్తుండగా ఫ్లైఓవర్‌పై శనివారం ఓ 108 వాహనం మొరాయించింది. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగిని డక్కిలి మండలం నుంచి స్విమ్స్ ఆస్పత్రికి తీసుకొస్తుండగా గేర్‌బాక్స్ సమస్య తలెత్తడంతో వాహనం ఆగిపోయింది. వాహనంలోని బాధితులను మరో వాహనంలో స్విమ్స్‌కు తరలించారు. అనేక 108 వాహనాలు ఇలాగే తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాగా, మరమ్మతులకు గురైన 108 వాహనం కిటికీల అద్దాలు కూడా వేయకుండా దాదాపు రెండు గంటలపాటు ఫ్లైఓవర్‌పై వదిలేయడాన్ని పలువురు విమర్శిస్తున్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 207మంది

తిరుపతి(విద్య), జూన్ 1: ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. శనివారం 75001 నుంచి 92000 ర్యాంకుల మధ్య ఉన్న విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరిగిందని, మొత్తం 207 మంది హాజరయ్యారని కోఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథ రెడ్డి తెలిపారు. ఆదివారం 92001 నుంచి 108000 ర్యాంకుల మధ్య ఉన్న విద్యార్థులకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ జి.కృష్ణమూర్తినాయుడు, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ ఎస్.సుధీర్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్లకు దరఖాస్తు చేసుకోండి

కోట, జూన్ 1: తిరుపతి జిల్లాలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ కె.నారాయణ రావు తెలిపారు. జిల్లాలోని ఆయా గురుకులాల్లో 6,7,8 తరగతుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. ఆయా సీట్లలో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 5నుంచి 15వ తేదీ వరకు గురుకులం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 20న ఆయా తరగతుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కన్వీనర్ నారాయణరావు కోరారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ


మజ్జిగ ప్యాకెట్ల పంపిణీలో సీఐలు

గూడూరు, జూన్ 1: స్థానిక కోర్టు సెంటర్ బస్‌షెల్టర్ వద్ద శనివారం హనుమజ్జయంతి సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐలు రవికిరణ్, వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వేసవితాపం నుంచి ఉపశమనం పొందేందుకు బ్రాహ్మణ సేవా సంఘం ముందుకు వచ్చి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఏ.శివకుమార్, శ్రీనివాసరావు, లలితమ్మ, రామ్మూర్తి, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

మూడు గడ్డివాముల దగ్ధం



కోట, జూన్ 1: మండలంలోని కొక్కుపాడులో శనివారం మూడు గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. గ్రామానికి చెందిన రమణయ్య, కే.రమణయ్య, మురళికి చెందిన మూడు గడ్డివాములపై గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ పీకలు వేశారు. ఒక్కసారిగా ఆయా గడ్డివాముల్లో మంటలు చెలరేగటంతో స్థానికులు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే మూడు గడ్డివాములు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దీంతో తమకు రూ. 3.5లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

గొడవలకు దిగితే జైలుకే

డక్కిలి, జూన్ 1: సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉందని, గొడవలు చేస్తే జైలుకు తరలిస్తామని డక్కిలి ఎస్ఐ చౌడయ్య హెచ్చరించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈనెల 4వ తేదీన కౌటింగ్ జరుగుతున్న దృష్ట్యా ఫలితాల అనంతరం ఏవరైనా గొడవలు, ఘర్షణలు, అల్లర్లకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఫలితాల అనంరం పోలీసు అనుమతి లేకుండా విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు, బాణసంచా కాల్చడం లాంటి కార్యక్రమాలు చేపట్ట కూడదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, గెలుపోటములపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, కించపరిచేలా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు.

అతిపెద్ద విజయం దిశగా కూటమి: టీడీపీ

డక్కిలి, మే 1: ఎగ్జిట్ పోల్ సర్వేలు వాస్తవాలకు దగ్గరగా ఉన్నాయని తిరుపతి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు పి.రాజేశ్వరావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్, నేతలు పి.చంద్రమౌళి రెడ్డి, ఏ.సత్యనారాయణ, బీ.రాజేశ్వరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏ.రామచంద్రయ్య నాయుడు, మాజీ ఎంపీపీ పి. వెంకటరెడ్డి తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. కూటమి అతి పెద్ద విజయం దిశగా పయనిస్తుందని చెప్పారు. ఒకటి రెండు సర్వే సంస్థలు తప్ప మిగిలినవన్నీ టీడీపీ కూటమికి అధికారంలోకి వస్తుందని చెప్పాయన్నారు. జూన్ 4న వెలువడే ఎన్నికల ఫలితాలు చూసి ప్రతి ఒక్కరు ఆశ్చర్యపోతారన్నారు. ప్రజలు ఈ ఎన్నికల్లో కూటమి పక్షాన నిలబడ్డారని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్లు చెప్పారు.

టీడీపీ ఎన్ఆర్ఐ వెంకట్‌తేజకు సత్కారం


వెంకటతేజను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, జూన్ 1: టీడీపీ సీనియర్ నాయకుడు పేరం మధుసూదన్ నాయుడు కుమారుడు, ప్రవాస భారతీయుడు వెంకటతేజకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా సత్కరించారు. సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీకి ఓట్లు వేయించడం కోసం విశేష కృషి చేసిన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, శాలవాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఆయనున కలసి వారిలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీ కృష్ణారెడ్డి, నాయకులు పేరం రమేష్‌నాయుడు, మధుసూధన్‌నాయుడు, సందీప్, సుబ్రహ్మణ్యంరెడ్డి, పరుశరాం, రమేష్, వెంకటేష్ ఉన్నారు.

మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

శ్రీకాళహస్తి, జూన్ 1: రబీ సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్న హేమసింధు మోడ్రన్ రైస్‌మిల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డీఎస్పీ ఉమామహేశ్వరరావుకు ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. హేమసింధు మోడ్రన్ రైస్ మిల్లు యాజమాన్యం తన ద్వారా రైతులకు రావాల్సిన రూ.5లక్షల పెండింగ్ బిల్లులను చెల్లించకుండా నిర్లక్ష్యం చేసిందంటూ ఏర్పేడు మండలం చింతలపాళెం గ్రామానికి చెందిన లోకేష్ యాదవ్ అనే ఓ వడ్ల వ్యాపారి గత నెల 29న ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్డీవో వెంటనే మిల్లు యాజమాన్యంపై చర్యలు చేపట్టి బాధిత రైతులకు న్యాయం జరిగేలా చూడాలని డీఎస్పీని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో కావమ్మ అగ్నిగుండ ప్రవేశం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

నాగలాపురం, జూన్ 1: నాగలాపురంలోని వీకేఎం వీధిలో వెలసిన కావమ్మ సమేత మారయ్య ఆలయంలో శనివారం అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. ఉదయం 4.30 గంటల ప్రాంతంలో ఆలయ అర్చకులు కలశపూజ చేసి ఆలయంలోని అమ్మవారి ఎదుట అగ్నిగుండాన్ని సిద్ధం చేశారు. భక్తులు కంకణాలు ధరించి పసుపు బట్టలతో దీక్షతో అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు గోవిందుడు, చెంగల్ రాయులు, రమణయ్య, నాగరాజు, దేవా తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో రద్దీ

శ్రీకాళహస్తి, జూన్ 1: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 29వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, జూన్ 1: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశ పూజ చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. తరువాత స్వామివారిని పలు పుష్పాలతో అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పిచారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, జూన్ 1: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన అభయ వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వివిధ రకాల అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా నగలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వేదపండితులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కూటమి గెలుపు లాంఛనమే: టీడీపీ



చలపతి నాయుడు

శ్రీకాళహస్తి, జూన్ 1: ఎన్డీయే కూటమి గెలుపు లాంఛనమేనని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ముందు నుంచే రాష్ట్రంలో వైసీపీపై తీవ్ర వ్యతిరేకత కనిపించిందన్నారు. ఎన్డీయే కూటమి ఏర్పాటుతో రాష్ట్రంలో వార్ వన్‌సైడ్‌గా మారిందని చెప్పారు. ఎన్నికల రోజున పోలింగ్ సరళి కూటమికే చాలా సానుకూలంగా జరిగిందని, ప్రస్తుతం చాలా సంస్థలు ఎన్డీయే కూటమినే ప్రజలు ఆదరించినట్లు వెల్లడించడం హర్షణీయమని అన్నారు. 140 ఎమ్మెల్యే సీట్లు, 21 ఎంపీ స్థానాలను కూటమి కైవసం చేసుకోవడం ఖాయమని చలపతినాయుడు అన్నారు.

డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి



డాక్టర్ కుమార్

కేవీబీపురం, జూన్ 1: డయేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేవీబీపురం ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ కుమార్ చెప్పారు. ముఖ్యంగా వేసవిలో వడగాడ్పుల వల్ల డయేరియా సోకే అవకాశాలు ఉంటాయి. అందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నిల్వ ఉన్న, కలుషితమైన పదార్థాలను తినకూడదని, సాధ్యమైనంత వరకు ఆకుకూరలు, కూరగాయలు, మజ్జిగ, నిమ్మరసం లాంటివి తీసుకోవాలని సూచించారు. డయేరియా లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యం చేయించుకోవాలన్నారు.

ముత్తు మారియమ్మకు ప్రత్యేక పూజలు

కేవీబీపురం, జూన్ 1: మండల కేంద్రంలో వెలసిన సంతాన ముత్తుమారియమ్మకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

చిన్నతనం నుంచే సేవాభావం అలవర్చుకోవాలి

శ్రీకాళహస్తి, జూన్ 1: చిన్నతనం నుంచే ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకుని, సమాజ సేవలో తమ వంతు పాత్ర పోషించాలని సంఘ సేవకుడు కోటేశ్వరబాబు అన్నారు. పట్టణం చెంచులక్ష్మి కాలనీలో 1 నుంచి 5వ తరగతి వరకు చదివే 30మంది గిరిజన విద్యార్థులకు ఆయన శనివారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు.

అర్ధరాత్రి విద్యుత్ కోతలతో జనం ఇక్కట్లు

రేణిగుంట, జూన్ 1: మండలంలో అర్ధరాత్రిలో విద్యుత్ కోతలు విధించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేణిగుంట మండల వ్యాప్తంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతుండటంతో ప్రజలు బయటకు రావాలంటే బెంబేలెత్తుతున్నారు. వృద్ధులు, చిన్నారులు వేసవి తాపానికి అల్లాడిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో శుక్రవారం అర్ధరాత్రి ఏకంగా పలుమార్లు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. విద్యుత్ అధికారులకు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ చేశారు. అలాగే శనివారం మధ్యాహ్నం గంట సేపు విద్యుత్ కోత విధించారు. ఈ విషయంపై అర్బన్ ఏఈని వివరణ కోరగా విద్యుత్ వినియోగం ఒకసారిగా పెరగడంతో ఓల్టేజ్ సమస్య ఉత్పన్నమైందని చెప్పారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ



నారాయణవనం, జూన్ 1: నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజల సేవ నిర్వహించారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆలయాధికారులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా త్రివిక్రమ్‌రావు



బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 1: బుచ్చినాయుడుకండ్రిగ మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా త్రివిక్రమ్ రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఎంపీడీవో ప్రతాప్ రెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేయడంతో ఇదే కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న త్రివిక్రమ్‌రావును ఇన్‌చార్జిగా నియమించారు.

కమీషన్ల కోసం అక్కరలేని పనులు

- ముక్కంటి మాస్టర్‌ప్లాన్ స్థలంలో పిట్టగోడ నిర్మాణం
- నాసిరకం పనులతో మూడు నెలలకే కూలిన వైనం
- అధికారులు, పాలకుల కక్కుర్తి పనులపై విమర్శలు



ముక్కంటి ఆలయం వద్ద కూలిపోయిన గోడ

శ్రీకాళహస్తి, జూన్ 1: కమీషన్ల కక్కుర్తితో ముక్కంటి ఆలయ సొమ్మును బొక్కేశారని ఐదేళ్ల నుంచి పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొందరు ఇంజనీరింగ్‌శాఖ అధికారులు, వైసీపీ నేతలు ఒకటై ఇష్టారాజ్యంగా నాసిరకం నిర్మాణాలకు తెరతీశారు. అసలు అవసరమే లేని పనులను తెరమీదకు తెచ్చి అందినంత మేసేశారు. మాస్టర్‌ప్లాన్ కోసం కేటాయించిన స్థలంలో రూ.40లక్షలతో నాలుగు నెలల క్రితం పిట్టగోడ నిర్మించారు. గుర్తు తెలియని వాహనం తాకడంతో నాసిరకం పనుల డొల్లతనం బట్టబయలైంది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొందరు అధికారులు, పాలకులు చేతులు కలిపి పథకం ప్రకారం కమీషన్ల కోసం అనవసరమైన నిర్మాణాలు చేపట్టిన విషయం చాలాసార్లు తెరమీదకు వచ్చింది. పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతూ వచ్చినప్పటికీ తాము అనుకున్నదే తడవుగా అన్ని పనులను సాగించేశారు. స్వర్ణముఖి నది ఒడ్డు మరుగుదొడ్లను నిర్మించడం తగదని తెలిసినప్పటికీ కమీషన్ల కోసం యుద్ధప్రాతిపదికన ఆ పనులను పూర్తి చేశారు. కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో రూ.40లక్షలలో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారిపోయాయి. ఇక టూరిస్టు బస్టాండు నుంచి భరద్వాజ తీర్థం వరకు చెక్కుచెదరని దృఢమైన సిమెంటు రోడ్డు ఉన్నప్పటికీ రూ.1.60కోట్లతో బాగున్న రోడ్డుపైనే రోడ్డు వేసి అభాసుపాలయ్యారు. ఇక సన్నిధివీధిలో పురపాలకసంఘ పరిధిలోని మురుగుకాలువలను రూ.70లక్షల ముక్కంటి ఆలయ నిధులతో నిర్మించారు. దీనిపై ఎన్ని అభ్యంతరాలు వచ్చినా తమ స్వార్థప్రయోజనాలను మాత్రం వీడకుండా ముందుకు సాగారు. ఇక ముక్కంటి ఆలయ ప్రాకారానికి ఆనుకుని గత టీడీపీ ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్‌ను ప్రకటించింది. అందుకోసం 190 ప్రైవేటు స్థలాలను దేవదాయశాఖ బాధితులను బుజ్జగించి కొనుగోలు చేసింది. మాస్టర్‌ప్లాన్ అమలు కోసం గత టీడీపీ ప్రభుత్వం రూ.100కోట్లు నిధులు కూడా మంజూరు చేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మాస్టర్‌ప్లాన్ అమలులో ఎలాంటి పురోగతి సాధించలేకపోయింది. అయితే మాస్టర్‌ప్లాన్ స్థలంలో భక్తుల బస పేరుతో ఈ యేడాది ఫిబ్రవరిలో రూ.40లక్షలతో రేకుల షెడ్ నిర్మించారు. అది 20 రోజులకే నేలకూలిపోయింది. ఆ ఫోటోలు సామాజిక మాధ్యమాలు వైరల్ కావడంతో ముక్కంటి ఆలయ అధికారులు, పాలకుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇదే మాసర్‌ప్లాన్ స్థలంలో రూ.40లక్షల నిధులతో ఫిబ్రవరి నెలలోనే పిట్టగోడ నిర్మించారు. అసలు అది ఎందుకు అవసరం... భవిష్యత్తులో మాస్టర్‌ప్లాన్ అమలు అయితే పిట్టగోడను తొలగించాలి కదా అని పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. దీనిపై ప్రజసంఘాలు నిలదీశాయి. అయినా తమ మాటే శాసనం అన్నట్లుగా ముందుకు సాగారు. పిట్టగోడలో కనీసం బెల్టు, పిల్లర్లు కూడా నిర్మించలేదు. కేవలం సిమెంటు రాయితో ఎలాంటి పునాదులు లేకుండా హడావుడిగా కట్టి సొమ్ము చేసుకున్నారు. శనివారం రోజున చిన్నపాటి ఆటో పిట్టగోడను తాకడంతో కూలిపోయింది. ఇది గమనించిన స్థానికులు గోడ కూలిపోయిన అంశాన్ని సామాజిక మాధ్యమాలో పోస్టు పెట్టారు. అధికారులలు, పాలకుల కక్కుర్తి పనులపై మరోసారి జనం దుమెత్తిపోశారు.

సర్వీసు రోడ్డు నిర్మించి... ప్రాణ సంకటం తప్పించండి



జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తున్న లింగనాయుడుపల్లెవాసులు

శ్రీకాళహస్తి, జూన్ 1: జాతీయ రహదారి వద్ద ఆరుగ్రామాల ప్రజలకు తీవ్రప్రాణసంకటం పొంచి ఉందని... సర్వీసు రోడ్డు నిర్మాణంతో ప్రజా సమస్యను పరిష్కరించాలని తొట్టంబేడు మండలం లింగమనాయుడపల్లె గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. శనివారం తిరుపతిలో జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లును కలిసి సమస్యపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లింగమనాయుడపల్లె గ్రామస్తులు గుడ్లూరు వెంకట్రామానాయుడు, నిరీష్ చౌదరి మాట్లాడుతూ గతంలో పూతలపట్టు - నాయుడుపేట రెండులేన్ల జాతీయ రహదారి నుంచి లింగమనాయుడపల్లెకు గ్రామీణ నిర్మించారని తెలిపారు. ప్రస్తుతం ఆరులేన్ల రహదారిగా విస్తరణ జరిగిందని చెప్పారు. అయితే తమ పంచాయతీ రోడ్డును నేరుగా రహదారికి అనుసంధానం చేయడంతో ఇక్కడ పెద్దసంఖ్యలో ప్రమాదాలు సంభవిస్తూ బ్లాక్‌స్పాట్‌గా మారిందన్నారు. లింగమనాయుడుపల్లె, కురవకన్నేరి, గుమ్మడిగుంట, భవానీశంకరాపురం తదితర గ్రామాలతో పాటు ఖజారియా టైల్స్ పరిశ్రమ నుంచి సిబ్బంది, వాహనాలు, ప్రజలు ఇదే రహదారి వద్దకు చేరుకోవాల్సి ఉందన్నారు. జాతీయ రహదారికి అవతలి వైపున ప్రభుత్వ పాఠశాల ఉండటంతో పిల్లలను పాఠశాలకు చేర్చేందుకు అరచేతిలో ప్రాణాలను పెట్టుకుని సాగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే తరహాలో రోడ్డుకు అవతలి వైపున గ్రామదేవత జల్లిపాపయ్య ఆలయం కూడా ఉందన్నారు. అంతేకాకుండా వ్యవసాయ భూములు రహదారికి అవతల ఉండటంతో నిత్యం రైతులు రాకపోకలు సాగించాల్సి ఉంటుందన్నారు. గత పదేళ్లలోనే సుమారు 20 రోడ్డు ప్రమాదాలు ఇక్కడ సంభవించాయని వాపోయారు. పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న ఓ బాలుడు భారీ వాహనం ఢీకొనడంతో దుర్మరణం చెందిన ఘటనలు ఉదహరించారు. ప్రస్తుతం ఆరులేన్ల రహదారి కావడంతో వేగంగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. తమకు సర్వీసురోడ్డు లేకపోవడంతో నేరుగా రహదారిపైకి ప్రవేశించి అక్కడ నుంచి ఆరువందల మీటర్ల పాటు వ్యతిరేక దిశలో రహదారిపై సాగి ఆ తరువాత అండర్‌పాస్ వంతెన నుంచి రావాల్సిన వైపు ప్రయాణం సాగించాల్సి ఉంటుందని వివరించారు. ప్రజావసరాల దృష్ట్యా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు నాయుడు, మురళి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా హనుమాన్ జయంతి



శ్రీకాళహస్తి, రేణిగుంటలో ప్రత్యేకాలంకారంలో ఆంజనేయస్వామి

శ్రీకాళహస్తి, జూన్ 1: శ్రీకాళహస్తీశ్వరాలయంలో హనుమాన్ జయంతి వేడుకలను ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయంలోని పదహారు కాళ్ల మండపం వద్ద వెలసిన ఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పూజలు చేపట్టారు. తొలుత కలశ స్థాపన పూజలు జరిపి అనంతరం హనుమాన్ విగ్రహానికి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి చందనంతో విశేష అలంకారం చేసి ధూప దీప నైవేద్యాలు నివేదించారు. పూర్ణాహారతులు సమర్పించారు. ఇక పట్టణ శివారులోని బంగారమ్మ కాలనీ వద్ద ఉన్న ఆంజనేయస్వామికి పట్టణానికి చెందిన లక్ష్మీ జువెలరీ అధినేత జూలుగంటి గోపికృష్ణ రూ.40వేల విలువ చేసే 108 తమలపాకుల మాలను వితరణ చేశారు. పట్టణంలోని ఉప్పువీధిలోని ఆంజనేయస్వామి, ముత్యాలమ్మగుడి వీధిలోని నింబజాదేవి ఆలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామంలోని భక్తాంజనేయస్వామికి, అక్కుర్తిలోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు, కంచనపుత్తూరు, జోగికండ్రిగ, కల్లివెట్టు, పల్లమాల గ్రామాల్లో ఆంజేయనేయ స్వామి ప్రత్యేక పూజలు చేశారు.

వరదయ్యపాళెం: మండలకేంద్రంలోని కల్యాణ వెంకటేశ్వరాలయంలో వెలసిన ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. ముందుగా 21 కలశాలతో పూజలు చేపట్టారు. అనంతరం లక్ష్మీగణపతి హోమం, మృత్యుంజయ హోమం, ఆంజనేయ స్వామి హోమం నిర్వహించారు. అలాగే కాంబాకం పంచాయతీ కృష్ణాపురంలో వెలసిన ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించారు.

రేణిగుంట: ఆంజనేయపురంలోని అభయ ఆంజనేయస్వామి, తారకరామానగర్ అభయ ఆంజనేయస్వామి, భజనగుడివీధిలోని జానకీరామ గుంటకట్ట వద్ద ఉన్న కరుమారియమ్మ, వెంకటేశ్వరాలయాల్లో ఆంజనేయస్వామికి పూజలు చేశారు. గణపతి హోమం, సీతారాముల కల్యాణం నిర్వహించారు.

తారకరామనగర్: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లో వెలసిన అభయాంజనేయస్వామికి అభిషేకాలు, కలశపూజ, గణపతిహోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

పిచ్చాటూరు: మండలంలోని కీళపూడి, తులసి కృష్ణాపురం అభయాంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.



పిచ్చాటూరు మండలం కీళపూడి అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పటిస్తున్న భక్తులు

పుత్తూరు వార్తలు

నందిమంగళంలో వైద్య శిబిరం

పుత్తూరు అర్బన్, జూన్ 1: మున్సిపల్ పరిధిలోని నందిమంగళంలో శనివారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి నుంచి స్థానికులు కొంత మందికి వాంతులు, విరోచనాలు కావడంతో మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. స్థానిక యూపీహెచ్‌సీ వైద్యుల పర్యవేక్షణలో శిబిరాన్ని ఏర్పాటు చేసి అస్వస్థతకు గురైన వారికి చికిత్స అందించారు. వేసవితాపం ఎక్కువగా ఉండడంతో పాటు మూడు రోజుల క్రితం గంగ జాతర జరిగింది. దీంతో ఫుడ్ కంటామినేషన్ జరిగినట్లు వైద్యులు ప్రాథమికంగా ధ్రువీకరించారు. స్థానికంగానే వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో రోగులు కోలుకున్నారు. అలాగే పారిశుధ్యం మెరుగుపడే విధంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి చెప్పారు.

వైభవంగా హనుమాన్ జయంతి



ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న బక్తులు

పుత్తూరు టౌన్/పుత్తూరు, జూన్ 1: పుత్తూరు మండలం తడుకు పంచాయతీలో ఆంజనేయస్వామి ఆలయంలో హనుమంతు జయంతి వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్వామివారికి నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం భక్తుల దర్శనార్థం స్వామివారిని విశేషంగా అలంకరించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం, స్వామివారి ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. ఉదయం అభిషేకాలు, అర్చనలతో స్వామివారి దర్శనం ప్రారంభం కాగా, భక్తులు సందడితో ఆలయం కిటకిట లాడింది. మధ్యాహ్నం అన్నదానం, భక్తులకు ప్రసాదాల పంపిణీ చేశారు.